ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 14.07.2024 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్ర వ్యాప్తంగా కల్లుగీత కార్మికులకు కాటమయి రక్షణ కవచం పేరుతో వృత్తి రక్షణ కిట్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొద్దిసేపట్లో రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ లో జరిగే కార్యక్రమంలో పంపిణి చేస్తారు.

2. నీతి ఆయోగ్ ఆదేశం ప్రకారం దేశంలో ఏ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చే అవకాశం లేదని కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝీ స్పష్టం చేశారు.

3. రాజకీయాలకు అతీతంగా కరీంనగర్ అభివృద్ధికి కృషి చేస్తామని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు.

4. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అవుతున్నా ఇంత వరకు ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ కానీ ఉద్యోగం కానీ ఇవ్వలేదని బిఆర్ఎస్ నాయకుడు తారక రామారావు ఆరోపించారు.

**కాటమయ్య రక్షణ కవచం**

కల్లుగీత కార్మికుల రక్షణకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. గీత కార్మికులు ఎవరూ చెట్టుపై నుంచి కిందపడి ప్రాణాలు కోల్పోకుండా ఉండేందుకు ప్రత్యేక కిట్లను తయారు చేసింది. కాటమయ్య రక్షణ కవచం పేరిట 6

పరికరాలున్న కిట్ను రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్  మండలం లష్కర్గూడ తాటివనంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొద్ది సేపట్లో కల్లుగీత గీత కార్మికులకు స్వయంగా అందిస్తారు. అనంతరం గీత కార్మికులతో సమావేశం జరిపి వారితో కలసి సహపంక్తి భోజనం చేస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కల్లుగీత కార్మికులందరికి దశల వారీగా కాటమయ్య రక్షణ కిట్లను పంపిణీ చేస్తారు.

బీసీ కార్పొరేషన్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా గీత కార్మికులకు పంపిణీ చేయనున్న కిట్లను హైదరాబాద్ ఐఐటీతో కలిసి ఓ ప్రైవేట్ సంస్థ తయారుచేసింది. ప్రమాదవశాత్తు తాటిచెట్లపై నుంచి కిందపడకుండా ఆ పరికరాల్లో అత్యాధునిక సాంకేతికతను వినియోగించారు. 6 పరికరాలుండే ఆ కిట్లో  తాడు, క్లిప్పులు, హ్యాండిల్స్, స్లింగ్బ్యాగ్, లెగ్లూప్  వంటివన్నీ వేర్వేరుగా ఉంటాయి. ప్రస్తుతం గీత కార్మికులు ఉపయోగిస్తున్న మోకు తరహాలోనే సులువుగా తాళ్లు ఎక్కేందుకు ఆ కిట్టు దోహదపడుతుంది.

**PTC, HYD**

## ప్రత్యేక హోదా

దేశంలోని ఏ రాష్ట్రానికీ ప్రత్యేక హోదా ఇవ్వొద్దని నీతి ఆయోగ్ స్పష్టం చేసినట్లు కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝీ  పేర్కొన్నారు. బిహార్కు ప్రత్యేక హోదా డిమాండ్ నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్య చేశారు. ఆ ప్రాంత అభివృద్ధి కోసం నిధులను మాత్రం కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందని,  ప్రత్యేక హోదా ఇవ్వడం మాత్రం సాధ్యం కాదని కేంద్ర మంత్రి చెప్పారు.

(DESK)

బడ్జెట్

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి పూర్తి స్థాయిలో తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ ను ఆర్థిక శాఖ అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఈనెల 23న కేంద్రం పార్లమెంటులో 2024-25 ఆర్థిక సంవత్సరానికి పూర్తి బడ్జెట్ను ప్రవేశపెడుతోంది. అందులో రాష్ట్రానికి ఎంత మేర నిధులు దక్కుతాయనే అంచనాల ప్రకారం, రాష్ట్ర బడ్జెట్ ప్రతిపాదనలను ఖరారు చేస్తామని ఈనెల 25 లేదా 27న శాసనసభలో రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశాలున్నాయని తెలిపాయి. ఎన్నికల్లో ఇచ్చిన గ్యారంటీ హామీలను పక్కాగా అమలు చేసేలా రాష్ట్ర బడ్జెట్లో  నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. వ్యవసాయం, నీటి పారుదల, విద్యుత్ శాఖలకు భారీగా నిధులు కేటాయించే అవకాశం ఉంది. రైతు రుణమాఫీ, రైతు భరోసా, సాగు నీటి ప్రాజెక్టులు, ఉచిత విద్యుత్కు ఈ ఏడాది అధిక వ్యయం చేయాల్సి ఉందని భావిస్తున్నారు.

(DESK)

**కాళేశ్వరం**

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ కొనసాగుతోంది. సాంకేతికపరమైన అంశాల విచారణ దాదాపుగా పూర్తి కావడంతో ఆర్థిక పరమైన అంశాలపై పూర్తి స్థాయిలో కమిషన్ దృష్టి సారిస్తుంది. ఇప్పటికే నీటి పారుదల శాఖలోని గణాంక అధికారులతో పాటు వర్క్స్ అండ్ అకౌంట్స్ డైరెక్టర్ను

విచారించిన జస్టిస్ పీసీ ఘోష్, వారిని అఫిడవిట్లు దాఖలు చేయాలని వారిని ఆదేశించారు.

(DESK)

**బోనాలు**

గోల్కొండలో ఈరోజు  శ్రీ జగదాంబ మహాకాళి అమ్మవారి మూడవ బోనాల వేడుక వైభవంగా జరుగుతుంది. ఉదయం నుంచి మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్నారు. ఈ సందర్భంగా  గోల్కొండ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నారు.

HYD-PTC

**బోనాలు సిఎం**

హైదరాబాద్ లోని ప్రజాభవన్ లో ఉన్న నల్లపోచమ్మ దేవాలయంలో ఈ రోజు బోనాల ఉత్సవాలు నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ముఖ్య మంత్రికి స్వాగతం పలికారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , కొండ సురేఖ కూడా బోనాల వేడుకల్లో పాల్గొన్నారు.

(DESK)

**బండి సంజయ్**

రాజకీయాలకు అతీతంగా కరీంనగర్ అభివృద్ధికి కృషి చేస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు.
కరీంనగర్ లో ఈ రోజు తమకు జరిగిన ఆత్మీయ సత్కారం సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ , కరీంనగర్ అభివృద్ధిపై మంత్రి పొన్నం ప్రభాకర్, ఎం.ఎల్.ఎ గంగుల కమలాకర్ చర్చిస్తామని చెప్పారు. స్మార్ట్ సిటీ పథకం క్రింద కరీంనగర్ కు రావలిసిన నిధులు సాధిస్తామని హామీ ఇచ్చారు. కరీంనగర్ మేయర్ యాదగిరి సునీల్ రావు , పలు కార్పోరేటర్లు ఈ సందర్భంగా కరీంనగర్ అభివృద్ధి పనులకు నిధులను కోరుతూ కేంద్ర మంత్రికి వినతి పత్రం సమర్పించారు.

PTC (KARIMNAGAR)

**కేటిఆర్**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పార్టీ అధికారంలోకి వచ్చి 7 నెలలు అవుతున్నా ఇంతవరకు ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ గానీ, ఒక్క ఉద్యోగం కానీ ఇవ్వలేదని బి ఆర్ ఎస్ కార్యనిర్వహణ అధ్యక్షడు తారక రామారావు విమర్శించారు. ప్రభుత్వం ఏర్పాటు అయిన ఏడాదిలోగా 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని కాంగ్రెస్ ఇచ్చిన ఎన్నికల హామీ ఎలా నెరవేరుస్తారని ఆయన ప్రశ్నించారు. గత కొన్ని రోజులుగా నిరుద్యోగులు చేస్తున్న ఆందోళనను ప్రభుత్వం ఎందుకు

పట్టించుకోవడం లేదని తారక రామారావు అన్నారు. బిఆర్ ఎస్ హయాంలో తెలంగాణ భూములు సస్యశ్యామలం అయ్యాయని, 2015 నుంచి 2022 వరకు రాష్ట్రంలో రైతులు ఆత్మ హత్యలు తగ్గుతూ వచ్చాయని ఆయన అన్నారు. ఇందుకు సంబంధించిన గణాంకాలపై అరవింద్ వారియర్ తన ఎక్స్ ఎకౌంట్ లో పెట్టిన పోస్టును కేటిఆర్ ప్రస్తావించారు.

(DESK)

**పూరీ భాండాగారం**

ఒడిషాలోని పూరీ జగన్నాథ్ రత్న భాండాగారాన్ని 46 ఏళ్ల తర్వాత ఇవాళ తెరుస్తున్నారు. జస్టిస్ బి శ్వనాథ్ రథ్ కమిటీ నిర్ణయం మేరకు భాండాగారంలోని సంపదను లెక్కిస్తారు. మధ్యాహ్నం 1:28 నిమిషాలకు భాండాగారాన్ని తెరుస్తారు. భాండాగారంలోని వస్తువులను ఉంచేందుకు స్థలం కూడా గుర్తించారు. కాగా భాండాగారం ద్వారాలను నాగబందనం చేసినట్టు సమాచారం ఉండడంతో ముందు జాగ్రత్తగా పాములు పట్టేవారిని సిద్ధంగా ఉంచారు. ఈ భాండాగారంలో భారీగా బంగారం, వెండి ఆభరణాలు ఉన్నట్టు చెబుతున్నారు.

(DESK)

**ఫుడ్ సేఫ్టీ**

సంగారెడ్డి జిల్లాలో ఆహార భద్రతా విభాగం అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నాసిరకం ఆహార పదర్ధాలను, గడువు ముగిసిన ఆహార పదార్థాలను ప్రజలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, ఇతర ఆహార వ్యాపారులను హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

(PTC)

**ఆస్పత్రి తనిఖీ**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మిక తనిఖీ చేశారు. ఎమర్జెన్సీ వార్డులు, బ్లడ్ బ్యాంక్, ఐసియు, మెటర్నిటీ వార్డ్, ఎస్ ఎన్ సి యు, ఆపరేషన్ థియేటర్లు మిగతా విభాగాలను పరిశీలించి వైద్యులతో మాట్లాడారు. ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. బ్లడ్ బ్యాంకులో రక్తం నిల్వ పై ఆరా తీశారు.

(PTC)

**ప్రజావాణి**

జనగామ జిల్లా కలెక్టరేట్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రేపు రద్దయింది. జిల్లా ప్రజలు ఎవరూ తమ వినతులతో రేపు కలెక్టరేట్ కార్యాలయానికి రావద్దని కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ ఒక ప్రకటనలో తెలిపారు. (DESK)

**ఆసిఫాబాద్ వర్షాలు**

ఆసిఫాబాద్ జిల్లాలోని ప్రాజెక్టులలోకి ఎగువ నుంచి వరద నీరు చేరుతున్నందు వల్ల నీరు బయటికి వదిలే అవకాశం ఉందని , అందుచేత దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పి డి.వి. శ్రీనివాస్ రావు సూచించారు. వాగులు పొంగే అవకాశం ఉన్నందు వల్ల ప్రజలు వాగులు దాటేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రాణహిత నదీతీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు.

(PTC)

**వర్షాలు**

తెలంగాణలోని పలు జిల్లాల్లో బుధవారం వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది. అధికారులు తెలిపారు. ఈరోజు నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్నగర్, నాగర్కర్నూల్ జిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని వివరించింది.

(DESK)

**అరెస్ట్**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆన్ లైన్ బెట్టింగ్ లకు అలవాటు పడి వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్టు జిల్లా ఎస్.పి అఖిల్ మహాజన్ తెలిపారు. నిందితుల నుంచి వారు దొంగిలించిన ట్రాక్టర్ ను, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

(PTC)

**షార్ట్ హాండ్**

తెలంగాణ వ్యాప్తంగా ఈ రోజు షార్ట్ హాండ్ పరీక్షలు జరుగుతున్నాయి. హైదరాబాద్ లో మూడు , వరంగల్, నిజామాబాద్, ఖమ్మంలోని ఒక్కొక్క పాలిటెక్నిక్ లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షకు 1,568 మంది అభ్యర్థులు హాజరవుతున్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి షార్ట్ హాండ్ పరీక్షలు నిర్వహిస్తారు.

(DESK)

**జైళ్ల శాఖ**

తెలంగాణ జైళ్ల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకులు లాభసాటిగా మారాయి. ఆ శాఖ ప్రస్తుత వార్షిక ఆదాయం 30 కోట్ల రూపాయలకు చేరింది. ఖైదీలకు ఉపాధి కల్పించడంతో పాటు జైళ్ల శాఖకు ఆర్థిక చేయూత అందించే లక్ష్యంతో ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం కంపెనీల భాగస్వామ్యంతో 2013 జూన్ లో పెట్రోల్ బంకులను ప్రయోగాత్మకంగా ప్రారంభించారు.

నేడు రాష్ట్ర వ్యాప్తంగా 31 బంకులు నడుస్తున్నాయి. జైలు నుండి విడుదలై పెట్రోల్ బంకుల్లో పనిచేస్తున్న వారు నెలకు 16 వేల రూపాయలు వేతనం అందుకుంటున్నారు.

(DESK)